# మనం

## కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

మంగళవారం | 17 | మార్చి | 2026 | పేజీలు: 8


## గ్యాస్ సరఫరా పై ప్రత్యేక దృష్టి



4 లో



5 లో

### సత్వర న్యాయం కోసమే

# రెవెన్యూ క్లినిక్‌లు


- ప్రతి అర్జీకీ నాణ్యమైన పరిష్కారం చూపండి
- గడువులోపు సమస్య పరిష్కారానికి కృషిచేయాలి
- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్కు 88 అర్జీలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

### అమరావతిలో...

# హజ్ హౌస్

6 లో

- బకాయిలు రూ. 45కోట్లు వెంటనే విడుదల చేస్తాం
- 21 నెలల్లో అనేక సంక్షేమ పథకాలు
- ముస్లింలను రాజకీయంగా అభివృద్ధిలోకి తేవటమే లక్ష్యం
- ఇఫ్తార్ విందులో చంద్రబాబు నాయుడు





-విజయవాడ, మనంబ్యూరో

# రైతన్న వద్దకే ప్రభుత్వం

- లాభసాటి వ్యవసాయమే లక్ష్యం
  పంటల వైవిధ్యీకరణతో రైతుల ఆదాయం పెంపు
- టెక్నాలజీతో వ్యవసాయంలో కొత్త మార్పులకు శ్రీకారం
- అంతర్జాతీయ మార్కెట్ను దృష్టిలో పెట్టుకుని రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలి
- ఖరీఫ్‌ను మే 15 నుంచే ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ఎన్టీఆర్ జిల్లాలో రైతన్న.. మీకోసం కార్యక్రమంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



7 లో

-విజయవాడ, మనంబ్యూరో

### పారిశ్రామిక వేత్తలకు

# ప్రోత్సాహం

4 లో

పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి సహకారం

కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు.



# స్మార్ట్ మార్నింగ్ న్యూట్రిషన్ శక్తితో రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోండి



గాంధీనగర్ మార్చి 16 మనం న్యూస్: వాతావరణం మారుతున్న కాలంలో రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసుకోవడం చాలా అవసరం. జలుబు, ఫ్లూ, ఇతర శ్వాసకోశ వ్యాధులు ఇలాంటి పరిస్థితుల్లో వేగంగా వృద్ధి చెందుతాయి. కాబట్టి రోజు ప్రారంభం నుంచే పోషకాలతో కూడిన ఆహారంతో శరీరానికి మద్దతు ఇవ్వడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఉదయం పూట సరైన జీవనశైలి రోగనిరోధక వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన ప్రాథమిక మద్దతును అందిస్తుంది. బాదం, గుడ్లు, సిట్రస్ పండ్లు, పులియబెట్టిన ఆహారాలు, తృణధాన్యాలు వంటి వాటిని ఉదయం పూట తీసుకోవడం వల్ల శరీరానికి శక్తితో పాటు.. రోగనిరోధక పనితీరును మెరుగుపరిచే, వాపును తగ్గించే కీలకమైన సూక్ష్మపోషకాలు అందుతాయి. ఉదయం అల్పాహారంలో చేర్చుకోవాల్సిన నాలుగు సులభమైన ఎంపికల గురించి న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి తెలిపారు.

## ధూమపానం కన్నా వేపింగ్ తక్కువ ప్రమాదం

గాంధీనగర్ మార్చి 16 మనం న్యూస్: ఆహారం, పర్యావరణం, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం కోసం ఫ్రెంచ్ ఏజెన్సీ ఇటీవల సమగ్ర శాస్త్రీయ అంచనాను విడుదల చేసింది. ఇది సంప్రదాయ ధూమపానం కన్నా వేపింగ్తో ఆరోగ్యానికి చాలా తక్కువ ప్రమాదాలు ఉన్నాయని ధ్రువీకరించింది. అలాగే, ఇది ప్రమాద రహితం కాదని తేటతెల్లం చేసింది. వేపింగ్ విషపూరిత ప్రభావాన్ని పరిశీలించే 2,500 కన్నా ఎక్కువ అధ్యయనాల సమీక్ష ఆధారంగా ఈ విషయంలో ఒక అంచనాకు వచ్చింది. వేపింగ్, ధూమపానం మధ్య ప్రాథమిక వ్యత్యాసం పొగాకు దహనం లేకపోవడంలోనే ఉందని ఏజెన్సీ నొక్కి చెబుతుంది. సంప్రదాయ సిగరెట్లు పొగాకును కాల్చివేస్తాయి. అధిక స్థాయిలో విషపూరిత, క్యాన్సర్ కారక సమ్మేళనాలను ఉత్పత్తి చేస్తాయి. వాటితో పోల్చితే, ఇ-సిగరెట్లు చాలా తక్కువ హానికరమైన పదార్థాలను కలిగి ఉన్న ఏరోసోల్ను ఉత్పత్తి చేయడానికి ద్రవాన్ని వేడి చేస్తాయి. అలాగే, చాలా తక్కువ సాంద్రతలలో ఉంటాయి. ఈ గణాంకాలు ధూమపానం చేయని వారికి వినోద ఉత్పత్తిగా కాకుండా, ధూమపానం చేసేవారికి వేపింగ్ ప్రధానంగా హాని తగ్గించే సాధనంగా మిగిలిపోయిందని బలపరుస్తున్నాయి. ఆక్స్ఫర్డ్ విశ్వ విద్యాలయంలో సాక్ష్యం ఆధారిత ఆరోగ్య సంరక్షణలో లెక్చరర్, సీనియర్ పరిశోధకుడు జోనాథన్ లివింగ్స్టోన్-బ్యాంక్స్, పీహెచ్డీ మాట్లాడుతూ, "ఇ-సిగరెట్లు పూర్తిగా సురక్షితంగా ఉండే అవకాశం లేనప్పటికీ, అవి పొగాకు కన్నా చాలా సురక్షితమైనవని మనం ధీమాతో ఉండవచ్చు" అని తెలిపారు.

## ప్రారంభమైన పది పరీక్షలు

వీరులపాడు జుజ్జూరు, మార్చి 16 (మనం న్యూస్ ): పదవతరగతి పబ్లిక్ పరీక్షలు గణనీయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా మెదలు కాబడినవి. వీరులపాడు మండలం జుజ్జూరు జడ్పీహెచ్ఎస్లో100 మంది విద్యార్థులు తెలుగు పరీక్ష రాయటం జరిగింది. విద్యార్థులు వారి తల్లితండ్రులు స్కూల్ లో ఆరెంజ్ చేసిన ఫెసిలిటీస్ గురుంచి (త్రాగు నీరు మరియు బాత్రూమ్స్ క్లీనింగ్ )సంతృప్తి చెందినారు. విద్యార్థులు తెలుగు ఎగ్జామ్ బాగా వ్రాసినట్లు వెల్లడించినారు. కొంతమంది విద్యార్థులు తల్లి తండ్రులు గేట్ దగ్గర చెట్లు లేనిచోట టెంట్ వేసి ఉంటే బాగుంటుంది అని భావిస్తున్నారు.అదే విధంగా రాష్ట్ర విద్యాశాఖ నియమాలు అనుగుణ్ణంగా చాలా స్ట్రిక్ట్ గా పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది అని స్కూల్ చీఫ్ సూపెరడెంట్ ఎస్ఎంఈ జయలక్ష్మి తెలిపారు.



## కీసర -గండేపల్లి రోడ్డులో ధర్నా చేసిన గ్రామస్తులు



కంచికచర్ల, మార్చి16(మనం న్యూస్): మండల పరిధిలోని కీసర నుంచి గండేపల్లి వెళ్లే రహదారిలో సెంటిని ఫ్యాక్టరీకి చెందిన భారీ వాహనాలు రోజుకు వందల సంఖ్యలో తిరగడం వలన రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతుందని ఆ గ్రామస్తులు సోమవారం ఉదయం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా గండేపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ, భారీ వాహనాలు తిరగడంవల్ల రోడ్డులో గుంతలు ఏర్పడుతున్నాయని ఫలితంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుకు తరచూ మరమ్మతులు గురవడంతో వాటిని మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడంలేదని తెలిపారు. సెంటినీ ఫ్యాక్టరీ కి వెళ్ళే వాహనాలను నియంత్రించడంతోపాటు రోడ్డు మరమ్మత్తుల బాధ్యత కూడా కంపెనీ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి ఎమ్మెల్యే

**రూ 1.08 కోట్లతో మూడు వెల్ నెస్ సెంటర్లకు శంకుస్థాపన**



మైలవరం, మార్చి 16 మనం న్యూస్: స్థానిక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. రూ1.08 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో మూడు చోట్ల నిర్మించనున్న మూడు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు (వెల్ నెస్ సెంటర్లు) నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శంకుస్థాపన చేశారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.36 లక్షలు చొప్పున వెచ్చించనున్నారు. స్థానిక దేవుని చెరువు పూరగుట్ట రోడ్డు వద్ద, పొందుగల రోడ్డు మసీదు వెనుక, సచివాలయం - 3 వద్ద వీటిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ దేవుని చెరువులో ప్రధాన రహదారులన్నీ సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో రూ32.92 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఓ పక్క అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం కోసం కూడా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడు పదుల వయస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రగతి కోసం శ్రమిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహన రావు గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యంగులకు అండగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



- బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్ళు అందజేత
- మూడు రోజుల వ్యవధిలోనే

**సమస్య పరిష్కారం**

మైలవరం, మార్చి 16 మనం న్యూస్: నడవలేక నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యంగులకు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అండగా నిలిచారు. వారి సమస్యను యుద్ధప్రాతిపదికన స్పందించి మూడు రోజుల లోపే పరిష్కరించారు. స్థానిక మండలం వెల్వడం గ్రామంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ని ఇద్దరు దివ్యంగులు మండలంలోని బొర్రగూడెంకు చెందిన కాళంగి కుమారి, సబ్జపాడు గ్రామానికి చెందిన మొండితోక రాజు స్వయంగా కలిసి వారికి ట్రై సైకిళ్ళు కావాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తమ స్వంత నిధులు వెచ్చించి వారికి బ్యాటరీ సాయంతో ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ళు సమకూర్చారు. పట్టణంలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో వీటిని దివ్యంగులకు అందజేశారు. దీంతో దివ్యంగులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ చైర్మన్గా సింగవరపు భాస్కర్ గణేష్ నియామకం



హనుమాన్ జంక్షన్ : మార్చి 16 (మనం న్యూస్ ): నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ కృష్ణాజిల్లా చైర్మన్గా సింగవరపు భాస్కర్ గణేష్ నియమితులయ్యారు.ఈ మేరకు నియామక పత్రాన్ని నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అంబటి నవ కుమార్ అందజేశారు. పర్యావరణ పరిరక్షణను ప్రధాన ధ్యేయంగా తీసుకొని ప్రకృతిలోని జీవులు, మొక్కలు, జంతువులు, సూక్ష్మజీవులు మరియు వాటి పరిసరాల మధ్య సమతుల్యతను కాపాడుతూ పర్యావరణాన్ని సంరక్షించేందుకు నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ కృషి చేస్తోందని భాస్కర్ గణేష్ అన్నారు. పంచభూతాలైన గాలి, నీరు,అగ్ని,భూమి, ఆకాశాలను కాలుష్యానికి గురికాకుండా పరిరక్షించడానికి ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ ఈసంస్థ పనిచేస్తోందని ఆ కార్యక్రమాలలో భాగంగా కృష్ణాజిల్లా చైర్మన్గా నన్ను నియమించడం జరిగిందని తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు జల మరియు వాయు కాలుష్యాలను నియంత్రించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ముఖ్యంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకేంద్ర పర్యావరణం,అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖమంత్రి భూపేంద్ర యాదవ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మరియు పర్యావరణం, అటవీ,శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వ అధికారులు



విశేషంగా పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ కార్యకలాపాలు కొనసాగుతాయనిభాస్కర్ గణేష్ చెప్పారు. కృష్ణా జిల్లా స్థాయిలో నన్ను చైర్మన్గా నియమించడానికి సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అంబటి నవ కుమార్,బోర్డు డైరెక్టర్ డాక్టర్ ఏ.వి. శ్రీలక్ష్మి చేసిన కృషికి వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో కృష్ణా జిల్లాలో సంస్థ చేపట్టే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తానని భాస్కర్ గణేష్ చెప్పారు. అలాగే తనకు ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలుగు బాష,సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది



## – మాజీ ఎంఎల్సీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, మార్చి 16 (మనం న్యూస్)ః తెలుగు భాష, సాహిత్యం, కళలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన అమూల్యమైన సంపద.ఆటువంటి సంపదను రక్షించి భావితరాలకు అందించడం ప్రతి తెలుగువారి బాధ్యత అని మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్ అన్నారు. సరసభారతి ఆధ్వర్యంలో మైనేని వెంకట నరసయ్య - సౌభాగ్యమ్మ స్మారక శాఖ గ్రంథాలయం లో వైభవంగా జరిగిన ముందస్తు ఉగాది వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉగాది అనేది కేవలం కొత్త సంవత్సర ఆరంభం మాత్రమే కాదనీ మన సంస్కృతి, సంప్రదాయం, జీవన తత్వాన్ని ప్రతిబింబించే మహత్తర తెలుగు పండుగ అని, సరసభారతి వంటి సాహిత్య సంస్థలు నిర్వహించే కార్యక్రమాలు తెలుగు భాష, సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని, ఆంధ్ర సామ్రాజ్య సాహిత్య సౌందర్య దర్శనం పేరిట తీర్చిదిద్దిన ఆలోకనం పుస్తకాన్ని వేదికపై అతిధులతో కలిసి ఆవిష్కరించడం సంతోషకర విషయం అని రాజేంద్రప్రసాద్ అన్నారు. అదేవిధంగా సరసభారతి వ్యవస్థాపకులు గబ్బిట దుర్గాప్రసాద్ అధ్యక్షతన తెలుగుదనం ఉట్టిపడేలాగా ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషకర విషయమని, ఉగాది పచ్చడిలోని ఆరు రుచుల్లా జీవితంలో సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించడం నేర్పే గొప్ప తత్త్వం తెలుగు సంప్రదాయంలో నిక్షిప్తమై ఉందని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన రచయితలు, కవులతో కవిసమ్మేళనం జరిగింది.ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కారాలు,జీవన సాఫల్య పురస్కారాలను సరసభారతి తరుపున ముఖ్యఅతిథి విచ్చేసిన రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అందజేసి వారిని సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ జి.వి. పూర్ణచంద్, ఆల్ ఇండియా రేడియో ఆకాశవాణి విజయవాడ కేంద్రం డైరెక్టర్ సి.హెచ్. మాణిక్యరావు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, సరసభారతి గౌరవాధ్యక్షులు జె. శ్యామల దేవి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సరసభారతి కోశాధికారి గబ్బిట వెంకటరమణ పర్యవేక్షించారు. తెలుగు రచయితలు, కవులు, సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వేడుకలను సాహిత్య పండుగగా మార్చారు.

# వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ




కంచికచర్ల,మార్చి 16(మనం న్యూస్ )ః స్థానిక జుజ్జూరు రోడ్డులోని భాస్కర్ హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ వినియోగదారులను ఇబ్బందులకు గురించేస్తుంది. గత కొద్ది రోజులగా గ్యాస్ ఏజెన్సీకి గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో గ్యాస్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వినియోగదారులు సోమవారం ఉదయం గ్యాస్ ఏజెన్సీ వద్ద గ్యాస్ కోసం బారులు తీరారు .గతంలోనూ ఈ ఏజెన్సీ పరిధిలోని వినియోగదారులు ఇదే తరహాలో ఇబ్బందులకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏజెన్సీ పరిధిలోని వినియోగదారులు కంచికచర్లలోని మరొక ఏజెన్సీకి వెళ్ళితే అక్కడి కార్యాలయ సిబ్బంది ఇది తమ పరిధిలోకి రాదని చెపుతుండటంతో చేసేదేమిలేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. గ్యాస్ ఏజెన్సీ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల వినియోగదారులు తమ ఇబ్బందులను పట్టించుకునే వారు లేరని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వినియోదారులకు గ్యాస్ సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే ఆంధ్రప్రదేశ్

- **మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**
- **ఇబ్రహీంపట్నంలో ఘనంగా పొట్టి శ్రీరాములు 125వ జయంతి**
- **పాల్గొన్న కూటమి నాయకులు**



ఇబ్రహీంపట్నం, మార్చి 16 (మనం న్యూస్)ః భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పోరాడిన మననీయులు, అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం రింగు సెంటరులో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు , పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జోహార్ పొట్టి శ్రీరాములు అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ అమరజీవి త్యాగస్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పే విధంగా 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైజ్' పేరుతో అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా ఆయన పేరుతో నిర్మించిన స్మృతివనంలో 58 అడుగుల ఎత్తైన భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీ.శే. పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని ఆయన కాంస్య విగ్రహాన్ని నేడు ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు పోరాటం చేశారన్నారు. తన పోరాటంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. 1952లో మద్రాస్లోని బలుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారని, 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. దివంగత పొట్టి శ్రీరాములు నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడి ప్రాణత్యాగం చేశారు. ఆయన మృతితో ఎంతోమంది విద్యార్థులు, అభ్యుదయ వాదులు, బయటకు వచ్చి పోరాడారు. దీంతో తెలుగువాళ్లకు ప్రత్యేక రాష్ట్రం ఇస్తామని అప్పటి ప్రధాని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ సాధన కోసమే కాకుండా సాంఘిక అసమానతలు, దురాచారాలపై కూడా పొట్టి శ్రీరాములు పోరాడారన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వృథా కానివ్వకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తో కలసి కూటమి కుటుంబ సభ్యులు తరలివెళ్లారు. మైలవరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి నూతులపాటి బాల కోటేశ్వరరావు (బాల) , మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) , స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

# తెలుగు వారి అత్మగౌరవం పొట్టిశ్రీరాములు

- **పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు**



విజయవాడ సెంట్రల్ మార్చి 16 (మనం న్యూస్)ః ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహానీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.అమర జీవి పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని, ఆయన చేసిన నిరాహార దీక్ష ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా గుర్తించబడిందని,వారి త్యాగస్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో శాంతి, ఐక్యత మరియు ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# హ్యుమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా రంజాన్ తోఫా పంపిణీ



మచిలీపట్నం మార్చి 16 (మనం న్యూస్)ః 8వ డివిజన్ పరిధిలోని లక్ష్మణరావుపురంలో కఠిన ఉపవాస దీక్షలో ఉన్న నిరుపేద ముస్లిం మహిళలకు రంజాన్ పండుగ సందర్భంగా హ్యూమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవడానికి అవసరమైన సేమియా, డ్రై ఫ్రూట్స్, నిత్యావసర సరుకులు వంటి పండుగ సామగ్రిని సంస్థ సభ్యులు సేకరించి, 50 మంది నిరుపేద ముస్లిం మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని హ్యూమానిటీ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఇంటి వద్ద నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టార్ విద్యాసంస్థల డైరెక్టర్ మరియు మానవతా జిల్లా విద్యానిధి కన్వీనర్ పి. శ్రీరామ్ పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా విశ్రాంత ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సి.ఐ. సాయి స్వరూప్ హాజరయ్యారు. అలాగే వార్డ్ టీడీపీ ఇంచార్జ్ ముంతా రవీంద్ర, జనసేన ఇంచార్జ్ కర్రి మహేష్ బాబు, మస్జీద్ మౌజన్ అబ్దుల్ అజీమ్ ఈ కార్యక్రమంలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతు హ్యూమానిటీ ఫౌండేషన్ గత కొన్ని సంవత్సరాలుగా సమాజ సేవలో ముందుండి పేదలు, వృద్ధులు మరియు అవసరమైన వారికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. పండుగ సమయాల్లో పేద కుటుంబాలను స్టార్ విద్యాసంస్థల డైరెక్టర్ పి. శ్రీరామ్ సంస్థ చేస్తున్న సేవలను అభినందిస్తూ రూ.10,000 విరాళంగా అందజేశారు. భవిష్యత్తులో కూడా హ్యూమానిటీ ఫౌండేషన్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమానిటీ ఫౌండేషన్ అధ్యక్షురాలు షైక్ నూర్జహాన్, కార్యదర్శి అజ్మతున్నిసా, ట్రెజరర్ షైక్ నాగూర్ హుస్సేన్, సభ్యులు విన్నకోట సంధ్య, సయ్యద్ సల్మా, అనిల్ కుమార్, ఎం. సతీష్, సుధ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతన్న మీకోసం వారోత్సవాలు ప్రారంభం



ఇబ్రహీంపట్నం ,మార్చి 16, (మనం న్యూస్)ః రైతన్న మీకోసం వారోత్సవాలు ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామాలలో ప్రారంభించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం 16/3/2026 నుండి 25/ 3/26 వరకు 19/3/ 2026 నుండి 23/3/26 విరామంతో ప్రతి గ్రామంలో ప్రతి ఒక్క రైతు ఇంటికి వెళ్లి ఆ రైతుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి సూచించబడిన పంచ సూత్రాల గురించి ఆ గ్రామాల వ్యవసాయ అధికారులు వివరిస్తూ వాటి యొక్క విలువను తెలియజేస్తూ, పంచ సూత్రాల గురించి ప్రభుత్వం కృషి చేస్తుందని రైతుకి ఎల్లవేళలా ప్రభుత్వం తోడుగా నిలుస్తుందని తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టడం జరిగింది. రైతులందరూ కూడా ఈ కార్యక్రమాలను తెలుసుకుంటూ, ప్రభుత్వం యొక్క కృషికి తోడుగా ఉండాలని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రజిని , గ్రామ వ్యవసాయ సహాయకులు, వెటర్నరీ డిపార్ట్మెంట్ మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# రైల్వే గ్రూప్‌-డి పరీక్షలకు ఉచిత శిక్షణ

- ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి
- ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.లక్ష్మీదేవి

విజయవాడ,మార్చి,16,(మనం న్యూస్)ః రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు గ్రూప్‌-డికు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.లక్ష్మీదేవి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. అర్హులైన 100 మంది అభ్యర్థులకు రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైపెండ్, స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు తెలిపారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా కోచింగ్కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్, కుల ధ్రువీకరణపత్రం, ఆదాయ ధ్రువీకరణపత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు మాత్రమే), బ్యాంకు పాస్బుక్ జిరాక్సు, రైల్వే రిక్రూట్మెంట్ గ్రూప్‌-డి అంగీకార పత్రం జిరాక్సు, రెండు పాస్పోర్టు సైజ్ ఫొటోలు జతపరిచి ఈ నెల 23వ తేదీలోగా విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం డోర్ నెం.74-2-1/5, అశోక్నగర్, పండరీపురం, రోడ్డు నెం.8, విజయవాడ- 520007కు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 99668 49937, 95050 94349, 86888 55255లో సంప్రదించాలని, శిక్షణ ఈ నెల 25వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ లక్ష్మీదేవి సూచించారు.ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు వినియోగించు కోవాలని కోరారు

# పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం

- పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి సహకారం
- జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ



మచిలీపట్నం,మార్చి16,(మనం న్యూస్)ః జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు.సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ఎగువ ఎతుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. సమావేశంలో అజెండా అంశాలు, పెండింగ్ దరఖాస్తుల పురోగతి, సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. విశాఖపట్నం పెట్టుబడుల సదస్సులో జిల్లాకు సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంఓయు) చేసుకున్న పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికవాడలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చెబుతూ సింగిల్ విండో పద్ధతిపై పరిశ్రమల ఏర్పాటుకు తక్షణ అనుమతులు, రాయితీలు కల్పించాలన్నారు. అందుకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలని సూచించారు. పారిశ్రామికవాడలో మౌలిక వసతులకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి, నీటి వసతి, ఏపీఐఐసీ, విద్యుత్, అగ్నిమాపక తదితర శాఖల వద్దకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి నిబంధనల ప్రకారం వసతులు కల్పించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారికి రుణ సదుపాయం, రాయితీల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బ్యాంకు అధికారులకు సూచించారు.

# పంచాయతీ కార్మికుడికి సిఐటియు సాయం



నందిగామ,మార్చి,16,(మనం న్యూస్)ః నందిగామ మండలం చందాపురం గ్రామంలో విధి నిర్వహణలో గాయపడిన పంచాయతీ కార్మికుడు కటికోళ్ల స్వామి కి సిఐటియు తరపున రూ. 9 వేలు ఆర్థిక సాయం అందజేశారు. చందాపురం పంచాయతీ కార్మికుడు కటికోళ్ల స్వామి విధి నిర్వహణలో వుండగా ప్రమాదవశాత్తు కిందపడి చెయ్యి విరగటంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. సోమవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె. గోపాల్, ఆశా వర్కర్ల సంఘం నాయకులు మన్నెం తిరుమల దేవి, నందిగామ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పుట్ట మాణిక్యం, అంగన్వాడి యూనియన్ అరుణ,సావిత్రి, మధ్యాహ్న భోజనం యూనియన్ నాయకులు పద్మ,ప్రమీల ఆశ వర్కర్ తదితరులు పాల్గొని ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కె.గోపాల్ మాట్లాడుతూ ఆపదలో వున్న కార్మికులను ఆదుకోవడానికి సిఐటియు అండగా వుంటుందని తెలిపారు.

# గ్యాస్ సరఫరా పై ప్రత్యేక దృష్టి



- వంట గ్యాస్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ
- సజావుగా సాగేలా విస్తృత తనిఖీలు
- ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

విజయవాడ, మార్చి,16,(మనం ప్రతినిధి)ః జిల్లాలో వంట గ్యాస్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని.. విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అన్నారు. సోమవారం జేసీ ఇలక్కియ అధికారులతో కలిసి విజయవాడ వన్ టౌన్ సుమన్ గ్యాస్ ఏజెన్సీ, గుణదలలోని అహ్మద్ గ్యాస్ ఏజెన్సీ, నున్నలోని మారుతి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆన్లైన్ డేటాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ నిల్వలు అవసరం మేరకు ఉన్నాయని, సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గ్యాస్ కొరతపై ఎలాంటి అపోహలకు లోనుకావద్దని తెలిపారు. గ్యాస్ ఏజెన్సీలు కూడా వినియోగదారులకు నిర్దేశ సమయానికి సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వంట గ్యాస్ సరఫరాకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే లేదా ఫిర్యాదులు ఉన్నట్లయితే జిల్లా కలెక్టరేట్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ను సంప్రదించవచ్చని తెలిపారు. ఇందుకోసం 9154970454 ఫోన్ నంబర్తో కంట్రోల్ రూం అందుబాటులో ఉంచినట్లు జాయింట్ కలెక్టర్ ఇలక్కియ చెప్పారు.

# త్యాగానికి ప్రతీక పొట్టి శ్రీరాములు

- మూల్పూరి సాయి కళ్యాణి

హనుమాన్ జంక్షన్: మార్చి 16: ( మనం న్యూస్ )ః త్యాగానికి నిలువెత్తు ప్రతిమ పొట్టి శ్రీరాములు అని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మూల్పూరి సాయి కళ్యాణి కొనియాడారు. కృష్ణాజిల్లా, బాపులపాడు మండల కేంద్రమైన హనుమాన్ జంక్షన్లోని మూల్పూరి సాయి కళ్యాణి నివాసంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కళ్యాణి మాట్లాడుతూ నిజమైన త్యాగనిరతికి ప్రతి రూపం పొట్టి శ్రీరాములు అని, 1952లో భాషాసంయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాటి ప్రభుత్వం పై పోరాటం చేసి 58 రోజులు ఆమరణ దీక్ష చేపట్టి తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు.అమరజీవి పొట్టి శ్రీరాములుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఘనమైన నివాళి అర్పిస్తోందన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో 58 అడుగుల ఎత్తు గల పొట్టి శ్రీరాములు కాంశ్య విగ్రహంను ఆవిష్కరించి అమరజీవికి ఘన కీర్తిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అందించి చరిత్ర సృష్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, శ్రీనివాస్, మేరీ,సుధర్, బాల మహిళలు పాల్గొన్నారు.



# ఆకివీడులో అశాంతికి కుట్ర

**– రఘురామకష్ణంరాజు తీరుపై నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ ధ్వజం**



గాంధీనగర్ మార్చి 16 మనం న్యూస్ : ఉండి నియోజకవర్గ పరిధిలోని ఆకివీడులో గత మూడు నెలలుగా అశాంతి నెలకొందని, మతకల్లోలాలకు కుట్ర జరుగుతోందని నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ జాతీయ అధ్యక్షుడు జాన్ మస్క్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీనగర్ లోని సోమవారం ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ రఘురామకష్ణంరాజు వైఖరి వల్ల హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరుల మధ్య చిచ్చు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తరతరాలుగా దళితుల ఆధీనంలో ఉన్న ఆలయాన్ని రామాలయంగా మార్చడం దారుణమని, ఇది దళిత సమాజాన్ని కించపరచడమేనని ఆయన విమర్శించారు. దళితుల ఆలయాన్ని ఇప్పటివరకు ఎందుకు ఎండోమెంట్ శాఖ పరిధిలోకి చేర్చలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒకవేళ రామాలయం నిర్మించాలనుకుంటే ప్రభుత్వ స్థలంలో నిర్మించుకోవాలని, దళితుల భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధిగా ఉండి నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి, మతపరమైన ఉద్రిక్తతలకు కారణమవుతున్నారని జాన్ మస్క్ మండిపడ్డారు. డ్రైనేజీ సమస్యలు, దోమల బెడద, ఇళ్ల నిర్మాణం వంటి మౌలిక వసతులపై దృష్టి సారించకుండా, ప్రార్థనా మందిరాల కూల్చివేతలకు పాల్పడటం శోచనీయమన్నారు. కేవలం బీజేపీకి దగ్గరయ్యేందుకే రఘురామకష్ణంరాజు రాష్ట్రాన్ని మణిపూర్ తరహాలో మార్చాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయంలో తక్షణమే స్పందించి శాంతి భద్రతలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. రఘు రామకష్ణంరాజు తన వైఖరిని మార్చుకోకపోతే సహించే ప్రసక్తి లేదని, మరో రెండు రోజుల్లో అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి భారీ జన సమీకరణతో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని జాన్ మస్క్ హెచ్చరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ సెల్ అధ్యక్షుడు పాస్టర్ ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ ఉప శాసనసభాపతి రఘురామకష్ణంరాజు బిజెపికి దగ్గరయ్య ప్రయత్నంలో నియోజకవర్గంలో మత ఘర్షణలను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. అనంతరం క్రిస్టియన్ సెల్ ప్రొటెక్షన్ పొలిటికల్ ప్రెసిడెంట్ జి రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఆకివీడులో రామాలయ నిర్మాణానికి తాము అడ్డంకి కాదని అయితే ప్రభుత్వ భూముల్లో గాని ప్రైవేటు భూముల్లో నిర్మించుకోవాలని సూచించారు దళితుల భూముల్లో ఏవిధంగా రామాలయాన్ని నిర్మిస్తారని ఆయన ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో క్రిస్టియన్ బోర్డు ప్రతినిధులు పీతల రాజు , యేసేబు,విజయ శేఖర్ ,ప్రకాష్ ,విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# సత్వర న్యాయం కోసమే రెవెన్యూ క్లినిక్‌లు



- ప్రతి అర్జీకీ నాణ్యమైన పరిష్కారం చూపండి
- గడువులోపు సమస్య పరిష్కారానికి కృషిచేయాలి
- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్కు 88 అర్జీలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,మార్చి,16,(మనం బ్యూరో)ః ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని..ప్రజలకు సత్వర న్యాయం కోసమే రెవెన్యూ క్లినిక్ లు ఏర్పాటు చేస్తున్నామని, అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 88 అర్జీలు వచ్చాయి. వీటిలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 18, రెవెన్యూకు 14, పంచాయతీరాజ్కు 12, పోలీసు శాఖకు 12 అర్జీలు వచ్చాయి. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, డీఆర్డీఏ, సాంకేతిక విద్యకు మూడు చొప్పున, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, మైన్స్, నైపుణ్యాభివృద్ధికి రెండు చొప్పున అర్జీలు రాగా.. ప్రజా రవాణా, విద్యుత్, బ్యాంకింగ్, బీసీ సంక్షేమం, సహకార, ఎక్సైజ్, దేవాదాయ, గృహ నిర్మాణం, పరిశ్రమలు, ఇరిగేషన్, మార్కెటింగ్, సాంఘిక సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, ప్రాధాన్యతతో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని అమలుచేస్తోందని.. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అధికారులతో నిరంతర సమన్వయంతో అర్జీల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అమరజీవి త్యాగం.. స్వాభిమానానికి ప్రతీక



- శ్రీ పొట్టి శ్రీరాములు మార్గం.. తరతరాలకు స్ఫూర్తిదాయకం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, మార్చి,16,(మనం ప్రతినిధి)ః అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు జాతి ఆత్మగౌరవానికి, భాషా-సాంస్కృతిక స్వాభిమానానికి నిలువెత్తు ప్రతీక అని.. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టరేట్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. అధికారులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాముల త్యాగనిరతిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం చాలా గొప్పదని, ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రేమ, నిస్వార్థంతో కూడిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత ఇలాంటి గొప్ప వ్యక్తుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషిచేయాలని సూచించారు. మహనీయుల త్యాగనిరతి, స్ఫూర్తిని భావి తరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అమరావతిలోని శాఖమూరులో పొట్టి శ్రీరాములు 58 అడుగుల భారీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వర్చువల్ గా హాజరై వీక్షించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేసిన బొండా రవితేజ



విజయవాడ సెంట్రల్, మార్చి 16 (మనం న్యూస్)ః సోమవారం 1వ డివిజన్ గుణదల ఉలవచారు కంపెనీ వద్ద పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సెంట్రల్ 1వ డివిజన్కు చెందిన ముస్లిం మైనారిటీ కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా రవితేజ పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ సెంట్రల్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నిరంతరం ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రతి వర్గానికి అండగా నిలుస్తున్నారని తెలిపారు, పేద ప్రజలకు సహాయం చేయడం, మైనారిటీలకు ప్రోత్సాహం అందించడం, నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడం వంటి అనేక కార్యక్రమాలతో బొండా ఉమా ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు .రంజాన్ మాసం ఉపవాసాలు, త్యాగం, సేవ భావనకు ప్రతీక అని, ఈ పవిత్రమైన మాసంలో మనందరం మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని, అల్లాహ్ ఇచ్చిన ఖురాన్లో చెప్పిన మంచిమాటలను మన జీవితాల్లో ఆచరిస్తూ సమాజానికి మంచి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో

# ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు



విజయవాడ సెంట్రల్, మార్చి 16 (మనం న్యూస్)ః పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ పరంగా ప్రయాణికులు, విద్యార్థులు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంత వాతావరణంలో ప్రయాణం సాగించాలని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డి.సి.పి. షిరిన్ బేగం పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేశారు. పరీక్షలు ప్రారంభ సమయంలో, పూర్తయ్యిన అనంతరం విద్యార్థులు సురక్షితంగా సులభంగా తమ పరీక్షా కేంద్రాలకు, ఇళ్లకు వెళ్లే క్రమంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. ఈ సందర్భంగా విజయవాడ నగరంలోని ప్రజలందరూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నియమాలను పాటించాలని ట్రాఫిక్ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చారిత్రక స్మారకం

అమరావతి, మనంప్రత్యేక ప్రతినిధిః ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల నిరాహార దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఎత్తులో ఈ విగ్రహాన్ని నిర్మించారు. అమరజీవి త్యాగ శిల్పం పేరుతో రూపొందించిన ఈ విగ్రహాన్ని, అమరావతి ప్రాంతంలోని శాఖమూరు పార్కులో మొత్తం 6.80 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ తో సహా, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రాజెక్ట్ లో తొలిదశ పనులు పూర్తి

ఈ విగ్రహ నిర్మాణానికి సుమారు 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్ ను ఉపయోగించారు. కేవలం ఆరు నెలల కాలంలోనే ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసి రికార్డు సృష్టించారు. ఈ ప్రాజెక్టుకు తొలిదశ పనులను పూర్తి చేసి శిల్పాన్ని ఆవిష్కరణ గావించారు. ఏపీ రాజధాని అమరావతిలో ఏర్పాటుచేసిన తొలి భారీ శిల్పంగా ఈ విగ్రహం ప్రత్యేకమైన గుర్తింపును సాధించింది.

### చారిత్రక స్మారకంగా అమరజీవి విగ్రహం

ఈ ప్రాజెక్టు రెండవ దశలో మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు నిర్మించే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుని చారిత్రక స్మారకంగా ఈ విగ్రహం నిలవనుంది. అమరావతి కేంద్రంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి చంద్రబాబు నాడు ఆంద్ర రాష్ట్రం కోసం కృషి చేసిన మహనీయుడికి సరైన గుర్తింపును ఇచ్చారు.



# విజయవాడ పోలీస్ కమిషనర్‌కు 71 ఫిర్యాదులు

విజయవాడ సెంట్రల్, మార్చి 16 (మనం న్యూస్)ః ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఉదయం 10.00 నుంచి 13.00 గంటల వరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ.పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఆదేశాల మేరకు డీసీపీ ఎ.బి.టి.ఎస్. ఉదయారాణి పాల్గొన్నారు. బాధితుల నుండి మొత్తం 71 ఫిర్యాదులు స్వీకరించి, ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భూ / ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలు - 40 భార్యాభర్తలు, కుటుంబ కలహాలు - 05, వివిధ మోసాలు - 03. మహిళా సంబంధిత నేరాలు - 05. దొంగతనాలు - 01 కొట్లాటలు -1. రోడ్డు ప్రమాదాలు, -1. ఇతర వివిధ సమస్యలు- 15, ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదుల పరిష్కారానికి సహకరించారు.



# అమరావతిలో హజ్ హౌస్ నిర్మాణం





## ఇఫ్తార్ విందులో చంద్రబాబు నాయుడు

**విజయవాడ, మార్చి 16 (మనం బ్యూరో):** ఇమామ్, మౌజన్లకు ఇచ్చే గౌరవ వేతన బకాయిలు రూ.45 కోట్లు వెంటనే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలో నూతనంగా హజ్ హౌస్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింలకు 21 నెలల్లో అనేక సంక్షేమ పథకాలు అందించిందని వివరించారు. విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్లో ప్రభుత్వం తరపున ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...కడపలో అసంపూర్తిగా ఉన్న హజ్ హౌస్ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్ష చేసిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇస్తున్నాం. అన్ని జిల్లాల్లోనూ, నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశాం. రంజాన్ పండుగను పురస్కరించుకుని పేదలకు దానం చేస్తే సంతోషంగా ఉంటారని మహ్మద్ ప్రవక్త బోధించారు. పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన సూక్తి. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధిలోకి తేవటమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ముస్లింలలో 4.38 లక్షల మందికి ఇస్తూ ఏడాదికి రూ.3,511 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 4.5 లక్షల మంది ముస్లిం విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తున్నాం. పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులు 19,215 మందికి రూ.264 కోట్లు విడుదల చేశాం. దీపం-2.0 పథకం కింద 6.20 లక్షల కుటుంబాలకు రూ.158 కోట్లతో సిలిండర్లకు ఖర్చు చేస్తున్నాం. ఇమామ్లకు రూ.5 వేలు, మౌజన్లకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనంగా రూ.180 కోట్లు అందించాం. మరో రూ.45 కోట్ల బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించాను.అని ముఖ్యమంత్రి ప్రకటించారు.






## ముస్లింల మనోభావాలను కూటమి ప్రభుత్వం గౌరవిస్తుంది

అర్హత కలిగిన ఇమామ్లను ప్రభుత్వ ఖాజీలుగా నియమిస్తున్నాం. వివాహ లైసెన్స్ గడువు 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచాం. 347 మంది ముస్లింలు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నాం. 33,275 మందికి ఆర్థిక చేయూత కింద రూ.193 కోట్లు ఇచ్చాం. యువతకు నైపుణ్యాలు అందించి మెరుగైన ఉపాధి ఉద్యోగాలు దక్కేలా చేస్తున్నాం. గత పాలకులు జీవో 47 ద్వారా వక్ఫ్ బోర్డును వివాదాల్లోకి నెట్టారు. ఆ జీవోను రద్దు చేసి వక్ఫ్ బోర్డును పునర్వ్యవస్తీకరణ చేశాం. 1500 వక్ఫ్ ఆస్తులను సర్వే చేశాం. వక్ఫ్ ఆస్తులను కాపాడుతున్నాం. నూర్ బాషా ఫెడరేషన్ పేరును దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పోరేషనుగా మార్పు చేసి రూ.100 కోట్లు కేటాయించాం. గత బడ్జెట్లో మైనారిటీలకు రూ.5,434 కోట్లు కేటాయిస్తే... ఈసారి రూ.6,090 కోట్లు కేటాయించాం. ఉర్దూ అకాడమీకి గత పాలకులు రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కూటమి ప్రభుత్వంలో రూ.7 కోట్లు మంజూరు చేశాం. అబ్దుల్ హక్ అవార్డు కింద రూ.1 లక్ష నుంచి రూ.1.25 లక్షలు ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. ఉర్దూ ఘర్, షాధీ ఖానాల నిర్మాణానికి రూ.2.85 కోట్లు కేటాయించాం. ముస్లిం జీవన ప్రమాణాలు పెంచేలా చేస్తున్నాం. అన్ని మతాలను గౌరవిస్తా... అందరివాడిలా ఉంటా. పేదలను ఆదుకునేందుకు పీ4 తీసుకొచ్చాం. ఎక్కడ పేదవాడు ఉంటే అక్కడ నేను ఉంటా' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విందులో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు నజీర్, బోండా ఉమ, గద్దె రామ్మోహన్, పలువురు ప్రజా ప్రతినిధులు, ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.



# రైతన్న వద్దకే ప్రభుత్వం.. లాభసాటి వ్యవసాయమే లక్ష్యం




- **పంటల వైవిధ్యీకరణతో రైతుల ఆదాయం పెంపు**
- **టెక్నాలజీతో వ్యవసాయంలో కొత్త మార్పులకు శ్రీకారం**
- **అంతర్జాతీయ మార్కెట్లను దృష్టిలో పెట్టుకుని రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలి**
- **ఖరీఫ్ను మే 15 నుంచే ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశం**
- **ఎన్టీఆర్ జిల్లాలో రైతన్న.. మీకోసం కార్యక్రమంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

విజయవాడ,అమరావతి/ మార్చి,16,(మనం న్యూస్): రాష్ట్రంలోని ప్రతి రైతు వద్దకే ప్రభుత్వం వెళ్లి లాభసాటి వ్యవసాయం దిశగా మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా రైతన్న.. మీకోసం కార్యక్రమాన్ని చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని గొల్లపూడిలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తో కలిసి రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. స్థానిక రైతులతో కలసి గ్రామంలో తిరుగుతూ కరపత్రాలను రైతులకు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచసూత్రాల అమలుతో రాష్ట్ర వ్యవసాయానికి కొత్త ఊపిరి పోస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, 62 శాతం జనాభా వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడిన రాష్ట్రంలో రైతును రాజుగా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు రైతులకు మద్దతుగా రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా కలుసుకుని క్షేత్రస్థాయిలో లాభసాటి వ్యవసాయం ఎలా చేయాలో అవగాహన కల్పించడంతో పాటు ప్రతి రైతు సేవా కేంద్రాన్ని ఒక యూనిట్గా తీసుకుని అక్కడ సాగులో ఉన్న పంటలు, రైతుల వివరాలను సేకరిస్తామని చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ మార్కెట్ ధరలను దృష్టిలో పెట్టుకుని ఏ ప్రాంతంలో ఏ పంటలు సాగు చేయాలో ముందుగానే సూచనలు అందజేస్తామని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల అభివృద్ధి కోసం ఐదు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సుమారు 80 శాతం నీటి నిల్వలు ఉన్నాయని, కాలువల మరమ్మతులు పూర్తి చేసి సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మార్కెట్లో అధిక ధరలు లభించే పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుతో పాటు మండవల్లిలో







నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధరలు పడిపోయినప్పుడు పొగాకు, మామిడి, కోకో, టమోటా, ఉల్లి రైతులకు 588 కోట్ల రూపాయలు ఖర్చుచేసి సుమారు లక్ష మంది రైతులను ప్రభుత్వం ఆదుకుందని, రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం అని తెలిపారు. గల్ఫ్ లో యుద్ధం కారణంగా ఎగుమతి పంటలైన కొబ్బరి, మొక్కజొన్న, అరటి, వంటి పంటల ధరలు తగ్గాయని వాటి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయ మార్గాలను, మార్కట్లను ఆన్వేషించి రైతులను ఆదుకుంటుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి అవసరమైన పలు ఇన్ పుట్ పరికరాల దిగుమతిలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాటిని కూడా అధిగమించి రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.20,000 ఆర్థిక సహాయాన్ని మూడు విడతల్లో జమ చేసామని, సీఎం చంద్రబాబు బటన్ నొక్కిన గంటలోనే 99.75 శాతం మంది రైతుల ఖాతాల్లో నగదు జమ అయిందని తెలిపారు. మే 15 నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, రిజర్వాయర్లలో నీరు ఉన్న నేపథ్యంలో రెండు నెలల ముందుగానే సాగు మొదలుపెడితే అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ నెల 25న ముఖ్యమంత్రి ఒక సచివాలయాన్ని సందర్శించి రైతన్న.. మీకోసం కార్యక్రమాన్ని ముగిస్తారని మంత్రి తెలిపారు. రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను ప్రోత్సహిస్తూ నీటి వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్ట్పైగతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు దాని గొప్పతనాన్ని గుర్తిస్తున్నారని అన్నారు. మారుతున్న ఆహార అలవాట్లు, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల వైవిధ్యీకరణ (డైవర్సిఫికేషన్) వైపు వెళ్లాలని సూచించారు. ఏలూరు ప్రాంతంలో పామాయిల్ సాగుతో రైతులు ఎకరాకు మంచి లాభాలు పొందుతున్నారని, కోకో, మిరియాల వంటి పంటల సాగు కూడా విస్తరిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ ధర పామాయిల్కు రాష్ట్రంలో లభిస్తోందని చెప్పారు. గత ఐదేళ్లలో వ్యవసాయ శాఖను నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో , ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో వ్యవసాయ రంగాన్ని తిరిగి బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయంలో సాంకేతికత వినియోగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్కు ప్రాధాన్యం ఇస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నూజివీడు ప్రాంతంలో మామిడి పంటకు కవర్లు సబ్సిడీతో అందిస్తున్నామని చెప్పారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కూడా మార్పు తీసుకురావాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొనే విధంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రైతులు పనిచేస్తే వ్యవసాయం మరింత లాభసాటిగా మారుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. విమర్శలు చేయడం తప్ప వైసీపీకి మరే పని లేదని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవలం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, రైతులు, ఎన్డీయే కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.






# దీక్షకు చిహ్నం...

# స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్







